



• ప్రమాణ శ్రీకారం

మచిలీపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం పార్లమెంట్ హాల్లో ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. బాలశౌరితో ఈ ప్రమాణ స్వీకారం చేయించారు.



• బాధ్యతల స్వీకారం

ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రిగా కొల్లు రవీంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం మూడో బ్లాకులోని మంత్రి పేషీలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కుటుంబ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆయన ఫైల్‌పై సంతకం చేశారు.

కొమ్మకొమ్మకో కోక

కొమ్మకొమ్మకో సన్నాయి.. వాటికి కోటి రాగాలు ఉన్నాయో లేదో కానీ.. ఇక్కడి కొమ్మల రెమ్మరెమ్మకో అందం.. సీతాకోకమ్మల రంగుల సోయగమే. హరివిల్లులోని వర్ణాలను వయ్యారాల వింజామరలుగా మరల్చుకుని.. రెక్కలు విదుల్చుతూ.. అటూ ఇటూ తిరుగుతూ ఈ సీతాకోకచిలుకలు చేసిన అల్లరి చూస్తే.. అహో ఆ సొగసు వర్ణించతరమా..! సోమవారం వర్షం కురిసిన వేళ పెదపులిపాకలో గుంపులుగా సాక్షాత్కరించిన ఈ సీతాకోకచిలుకలు జీవ వైవిధ్యంలోని మాధుర్యాన్ని తెలియజేశాయి.



మళ్లీ పెరిగిన డయేరియా కేసులు



జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

☛ జగ్గయ్యపేటలో కలవరం ☛ కొత్తగా 15 మందికి వ్యాధి లక్షణాలు

జగ్గయ్యపేట, జూన్ 24 : జగ్గయ్యపేట నియోజక వర్గంలో మళ్లీ డయేరియా కేసులు పెరిగాయి. ఈ వ్యాధి లక్షణాలతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ 15 మంది జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరగా, ఐదుగురిని విజయవాడ రిఫర్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న 19 మందిని డిశ్చార్జి చేశారు. కొత్తగా చేరిన కేసుల్లో జగ్గయ్యపేట పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల వారున్నారు. ఆర్టీసీ కాలనీకి చెందిన ఎం.కృష్ణలత (31), చెరువు బజార్‌కు చెందిన ప్రణయ్ (3), ఎం.విజయలక్ష్మి (24), చిల్లకల్లుకు చెందిన వి.సైదా (40), బూదవాడకు చెందిన బి.మంగ (70), జి.సరోజ (25), పి.కార్తీ (11), పి.కల్యాణి (34), అన్నవరానికి చెందిన బి.ధనమ్మ (25), వత్సవాయి మండలం పెదమోదుగపల్లి గ్రామానికి చెందిన వై.రామారావు (30), డి.నరసింహారావు (40), రావిరాలకు చెందిన వై.బుజ్జి, మంగొల్లుకు చెందిన జి.సిద్ధు (12), ముక్త్యాలకు చెందిన జె.ఎస్తేరు (5) ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసినీ, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్, డీపీఎంవో డాక్టర్ నవీన్ పర్యవేక్షణలో డాక్టర్లు స్నేహ, సమీరా, బాలాజీ, వాసంతి, అనిల్‌కుమార్, విద్యాసాగర్ సేవలందిస్తున్నారు.

చిత్తశుద్ధి ఏదీ?



హెడ్‌వాటర్ వర్క్స్‌లో రెండేళ్లుగా పనిచేయని మోటార్లు

పంపుల చెరువు వద్ద ఫిల్టర్‌బెడ్‌ను శుభ్రపరిచి నాలుగేళ్లు

150 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటుచేసినా ఉపయోగించరు

క్లోరినేషన్ సిలిండర్లు ఖాళీ అయ్యి వారమైనా పట్టించుకోరు

హెడ్‌వాటర్ వర్క్స్ అధికారుల అంతులేని నిర్లక్ష్యం

డయేరియా విజృంభిస్తున్న వేళ జాగ్రత్తలు అవసరం

రెండు జిల్లాల్లో డయేరియా విజృంభిస్తున్న వేళ బందరు మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం భయాందోళనకు గురిచేస్తోంది. కార్పొరేషన్ హెడ్‌వాటర్ వర్క్స్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి కొన్న విద్యుత్ మోటార్లను వినియోగించకుండా రెండేళ్లుగా నిలిపివేశారు. నగరంలోని 2.50 లక్షల మందికి తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్‌బెడ్‌ను శుభ్రపరచకుండా వదిలేశారు. తాగునీటిని మాత్రం సరఫరా చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ... మునిసిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెబుతున్నా మచిలీపట్నం మునిసిపల్ కార్యాలయ అధికారుల తీరు మాత్రం అలాగే ఉంది.

బందరులో నాలుగేళ్లుగా శుద్ధి చేయని తాగునీరు సరఫరా

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం పంపులచెరువు వద్ద ఉన్న హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద మోటారు షెడ్డును 2022లో నిర్మించారు. ఇందులో రెండు 150 హెచ్‌పీ మోటార్లు, 75 హెచ్‌పీ రెండు మోటార్లను ఏర్పాటు చేశారు. నీటిని పంపింగ్‌చేసే సమయంలో ఈ మోటార్ల సామర్థ్యానికి అనుగుణంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదు. 18, 12 అంగుళాల వ్యాసార్థం ఉన్న పైపులను ఏర్పాటుచేయాల్సి ఉండగా, 12, 8 అంగుళాల పైపులనే మోటార్లకు బిగించారు. దీంతో ఈ మోటార్లతో నీటిని తోడితే పైపులైన్లు పనిచేయవనే కారణంతో రెండేళ్లుగా అసలు ఆన్ చేయలేదు. మోటర్‌షెడ్ నిర్మాణం, మోటార్లు, పైపులను కొనుగోలు చేసి వాటిని బిగించినట్టు చూపి దాదాపు కోటి రూపాయలకుపైగా ప్రజాధనం వృథా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంచనాలు లేకుండా ఏర్పాటు చేసిన ఈ పైపులైన్లను మార్చాలంటే మళ్లీ లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.

ఫిల్టర్‌బెడ్‌ను క్లీన్‌చేసి నాలుగేళ్లు

పంపుల చెరువు వద్ద రా వాటర్‌ను శుద్ధి చేసేందుకు ఫిల్టర్‌బెడ్ ఉంది. ఇది 15 అడుగులకుపైగా లోతున ఉంటుంది. పంపుల చెరువులో శుద్ధిచేయని (రా వాటర్) నీటిని తొలుత ఈ ఫిల్టర్‌బెడ్‌లోకి పంపింగ్ చేస్తారు. ఈ సమయంలోనే నీటిని శుద్ధి చేసేందుకు, అందులో మలినాలు తొలగిపోయేందుకు, పురుగులు చనిపోయేందుకు అలంను కలుపుతారు. దీంతో నీటిలో ఉన్న మురికి విడిపోతుంది. ఫిల్టర్‌బెడ్ అడుగుభాగానికి మట్టి చేరుతుంది. ఇలా చేరిన మట్టిని కనీసం మూడు, నాలుగు నెలలకు ఒకసారైనా తొలగించాలి. వైసీపీ ప్రభుత్వంలో ఫిల్టర్‌బెడ్ అడుగున చేరిన మట్టిని తొలగించనేలేదు. ఈ ఫిల్టర్‌బెడ్‌లో నీటిని నిత్యం కదిపేందుకు చుట్టూ తిరిగేలా ప్రత్యేకంగా యంత్రాలు ఉంటాయి. నీటిని కదిపితే నీరు మరింతగా మురికి అవుతుందనే కారణంతో ఈ యంత్రాలను వాడకుండా నిలిపివేశారు. దీంతో తాగునీరు పూర్తిస్థాయిలో శుద్ధి కావడం లేదు.



నాలుగేళ్లుగా శుభ్రపరచని ఫిల్టర్‌బెడ్

క్లోరినేషన్ సిలిండర్లు ఖాళీ

పంపుల చెరువు వద్ద నీటిని క్లోరినేషన్ చేసేందుకు క్లోరిన్ ట్యాంకుల నుంచి లిక్విడ్ క్లోరిన్‌ను వినియోగిస్తారు. సంప్‌లో నుంచి నీటిని పంపింగ్ చేసే సమయంలో ప్రత్యేక పైపులైన్ ద్వారా క్లోరిన్‌ను నీటిలో కలుపుతారు. అయితే వారం క్రితమే క్లోరిన్ ట్యాంకులు ఖాళీ అయ్యాయి. అయినా కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోలేదు. ఖాళీ అయిన క్లోరిన్ ట్యాంకులను కర్నూలుకు తీసుకెళ్లే చర్యలకు ఆదివారం ఉపక్రమించారు. కర్నూలు జిల్లా నుంచి ఈ క్లోరిన్ ట్యాంకులు మచిలీపట్నానికి ఎప్పటికి వస్తాయి? ఎప్పటికి నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రైవేట్ వ్యక్తుల కనుసన్నల్లోనే..

పంపుల చెరువు వాటర్ వర్క్స్‌లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నా వారితో పని చేయించుకోరు. అక్కడ పనిచేసే ఇంజనీర్లు ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని పనులు చేయించడం రివాజుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంపుల చెరువు వద్ద పనిచేసే ఒక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ నాలుగు పెద్ద మోటార్లను తన షెడ్‌కు తీసుకెళ్లిపోయాడు. తనకు నాలుగు లక్షలకుపైగా బిల్లులు రావాలని, అవి మంజూరు చేస్తేనే తన వద్ద ఉన్న మోటార్లను ఇస్తానని చెబుతున్నాడు. ఇక్కడ పనిచేసే సీనియర్ ఎలక్ట్రీషియన్‌ను కనీసం మోటార్ షెడ్‌లోకి కూడా రానివ్వని పరిస్థితి. ప్రైవేట్ వ్యక్తితో పనులు చేయించుకుని పెద్దఎత్తున బిల్లులు చేసుకునేందుకు అధికారులు మొగ్గుచూపడం గమనార్హం. ఇటీవల మంత్రి కొల్లు రవీంద్ర వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏఈని పక్కనపెట్టారు. పంపుల చెరువు హెడ్‌వాటర్ వర్క్స్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తేనే పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందే అవకాశాలు ఉన్నాయని అక్కడ పనిచేసే సిబ్బంది చెబుతున్నారు.

కుర్చీని వదలరు..!



ఏపీటీడీసీలో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

- సీఈ రాజీనామా.. వెంటనే తిరిగి విధులకు హాజరు
- మళ్లీ పోస్టింగ్ ఆర్డర్ వస్తుందట.. ఉద్యోగం చేస్తారట..!
- నిన్నటివరకు వైసీపీ సైడ్.. నేడేమో టీడీపీ వైపు..!
- ఐదేళ్లలో పర్యాటక శాఖలో ఒక్క పనిచేయని ఘనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కుర్చీలకు అతుక్కుపోయిన వారిని కదిలించాల్సిన సమయమొచ్చింది. రిటైరైన వారందరితో రాజీనామాలు చేయించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసినా ఇక్కడ పనిచేసే వారికి లెక్క లేకుండాపోయింది. తాజాగా విడుదలైన జీవో ప్రకారం ఏపీటీడీసీలో రిటైరై పనిచేస్తున్న 18 మంది తక్షణం రాజీనామా చేయాల్సి ఉంది. అందరూ రాజీనామాలు అయితే చేశారు కానీ, మళ్లీ పోస్టింగులు తెచ్చుకుంటామన్న ధీమాతో ఉన్నారు.

ప్లేటు ఫిరాయించిన చీఫ్ ఇంజనీర్

ఏపీటీడీసీలో చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా రాజీనామా చేసిన అధికారి తిరిగొచ్చి ఆ సీటులోనే కూర్చున్నారు. రాజీనామా చేసిన అధికారి ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ మళ్లీ విధుల్లో చేరారు. మంత్రి, స్పీకర్ పేర్లు చెబుతూ మళ్లీ అదే సీటుకు అతుక్కుపోవాలని చూస్తున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి అంటకాగి, పర్యాటకాభివృద్ధికి అవరోధంగా నిలిచిన ఈ చీఫ్ ఇంజనీర్ తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లేటు ఫిరాయించారు. టీడీపీ నేతలు తెలుసంటూ కవర్ చేస్తున్నారు. అంతేకాదు.. అన్నవరం ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక పనిమీద ఆయన సోమవారం ఢిల్లీకి కూడా వెళ్లారు. ఈయనకు నెలకు రూ.2 లక్షల జీతం. ప్రతినెలా రూ.2 లక్షలకు తగ్గకుండా మెడికల్ బిల్లులు పెడతారు. ఇక దుబారా అంతా ఇంతా కాదు. ఈయన ఆధ్వర్యంలో ఐదేళ్లలో ప్రసాద్ స్కీమ్‌లో కానీ, స్వదేశ్ దర్శన్ స్కీమ్‌లో కానీ ఒక్క పని కూడా జరగలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండ విధ్వంసం దగ్గర నుంచి ప్రతి పనిలోనూ ఆయన ప్రభుత్వానికి తాబేదారుగా వ్యవహరించారు. చీఫ్ ఇంజనీర్‌గా అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిన అధికారి.. పర్యాటక యూనిట్లన్నింటినీ పగలగొట్టించారు. పనులు ఆగిపోవడంతో సందర్శకులు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ అధికారి గతంలో ఆర్‌అండ్‌బీ ఈఈగా ఉన్నప్పుడు రాజమండ్రి పుష్కరాల్లో పనిచేశారు. ఆ సమయంలో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఘాట్లకు సంబంధించిన పనుల నిర్లక్ష్యంపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఏపీటీడీసీలో కీలక అధికారిగా మారిపోయారు. మరో అధికారి వాటర్ ఫ్లీట్ జీఎంగా వ్యవహరిస్తున్నారు. ఈయన అయితే ఏకంగా హరిత బెర్మ్‌పార్కులోనే ఉంటున్నారు. పర్యాటక సూట్‌లో ఉంటూ సకల భోగాలూ అనుభవిస్తున్నారు. బదిలీల్లో ఈయన ఇష్టానుసారంగా చక్రం తిప్పారు. తన అనుయాయులను కీలక స్థానాల్లో నియమించడం, కానివారిని దూరప్రాంతాలకు పంపించేయటం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య.

సముద్ర దొంగలెవరు?



'సీ ఫ్యాన్స్' స్మగ్లింగ్ కేసులో అనేక అనుమానాలు

సముద్ర మట్టానికి 10-20 కిలోమీటర్ల లోతులో ఉండే సీ ఫ్యాన్స్‌ను బయటకు తీసుకొస్తుందెవరు..? వెళ్లినవారు గజ ఈతగాళ్లా... స్క్యూబా డైవర్లా..? అసలు సీ ఫ్యాన్స్‌కు బెజవాడలో అంత డిమాండ్ ఉందా..? సీ ఫ్యాన్స్ స్మగ్లింగ్ కేసులో అటవీశాఖ అధికారుల ముందు మెదులుతున్న ప్రశ్నలివి. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టడానికి నిందితుడ్ని కస్టడీకి కోరుతున్నారు.

- ☛ కేసులో స్క్యూబా డైవర్ల పాత్ర ఉన్నట్టు అనుమానం
- ☛ కట్టుకథలు వినిపిస్తున్న నిందితుడు శ్రీనివాసరావు
- ☛ కస్టడీ కోరుతున్న అటవీ శాఖ అధికారులు

విజయవాడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : సముద్రగర్భంలో అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న సీ ఫ్యాన్స్‌ను బయటకు తీసుకొచ్చి, ఫొటోఫ్రేముల్లో అమర్చి, విక్రయించి, లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్న ఎస్.శ్రీనివాసరావు అనే వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, సీ ఫ్యాన్స్‌ను సముద్ర గర్భం నుంచి తీసుకొస్తున్న వారు ఎవరన్నది తెలియలేదు. ఇందుకోసం ఒక మాఫియా పనిచేస్తోందని అధికారులు అనుమానిస్తున్నారు. నిందితుడు శ్రీనివాసరావుకు ఈ మాఫియాతో ఎలా లింకులు ఏర్పడ్డాయో తెలుసుకునే పనిలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. అయ్యప్పనగర్‌లోని అక్షయనిధి షాపులో శ్రీనివాసరావును పట్టుకున్నాక అధికారులు చాలాసేపు విచారణ చేశారు. ములుగు జిల్లాలోని మేడారం నుంచి సీ ఫ్యాన్స్ తీసుకొస్తున్నట్టు అతను చెప్పాడు. కానీ, ఇందులో వాస్తవం లేదని అధికారులు అంటున్నారు.

త్వరలో కస్టడీ పిటిషన్

సీ ఫ్యాన్స్ కేసులో నిందితుడు శ్రీనివాసరావుకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. జలరాశులను బయటకు తీసుకొచ్చే ముఠా వివరాలు తెలియాలంటే శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. కనీసం వారం పాటు శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ఏడాదిన్నరగా ఈ వ్యాపారం చేస్తున్నానని నిందితుడు అధికారులకు చెప్పాడు. ఇందులోనూ ఎలాంటి వాస్తవం లేదని అధికారులు అనుమానిస్తున్నారు. నిందితుడి బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేశారు. అందులో ఏ మేరకు నిల్వలు ఉన్నాయో అధికారులు సోమవారం తేల్చనున్నారు. మరోపక్క నిందితుడి సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా కాల్‌డేటా రికార్డ్ (సీడీఆర్)ను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు.

అధికారులకు సైతం బెదిరింపులు

అయ్యప్పనగర్‌లో అక్షయనిధి షాపులో సోదాలు చేస్తున్నప్పుడు నిందితుడు శ్రీనివాసరావు అటవీశాఖ అధికారులను బెదిరించాడు. ఇంటి కింది భాగంలో షాపు ఉండగా, పై అంతస్తులో వన్యప్రాణులు, జలరాశులకు సంబంధించిన భాగాలు ఉన్నాయి. వాటిని సీజ్ చేస్తున్న సమయంలో ఓ అధికారిని బెదిరించినట్టు తెలిసింది. క్షుద్రపూజలు చేయించి పతనం చేస్తానని హెచ్చరించినట్టు సమాచారం. కాగా, శ్రీనివాసరావును కలవాలంటే 48 గంటల ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. సాధారణ అపాయింట్‌మెంట్‌కు రూ.500 ధర నిర్ణయిస్తే, అత్యవసర అపాయింట్‌మెంట్‌కు రూ.1,500-రూ.2వేల వరకు వసూలు చేస్తారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం

ఇప్పటికైనా సమస్య పరిష్కరించండి

ప్రజా పరిష్కార వేదికలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదన



6లో..


డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీజేఏసీ అమరావతి నేతలు

మహిళా ఉద్యోగులకు సత్వర న్యాయం..

» డీజీపీని కోరిన ఏపీజేఏసీ అమరావతి నేతలు

వన్‌టౌన్, జూన్ 24 : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులపై అనుచితచర్యలకు పాల్పడిన వారిపై ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని, ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో పనిచేసే పరిస్థితి కల్పించాలని డీజీపీ ద్వారకా తిరుమలరావును ఏపీజేఏసీ అమరావతి నేతలు కోరారు. రామవరప్పాడు రింగ్‌లోని కె.హోటల్‌లో డీజీపీ ద్వారకా తిరుమలరావును సోమవారం ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ, అనుబంధ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణనాయుడు సంయుక్తంగా మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులకు ఆత్మస్థైర్యం కల్పించేలా వేధింపుల కేసుల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అనుబంధ సంఘాల నేతలు, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, హోంగార్డు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గోవింద్, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.


మల్లవల్లిలోని పారిశ్రామికవేత్తలతో సమావేశమైన యార్లగడ్డ

పారిశ్రామిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, జూన్ 24 : మల్లవల్లిలో నూతన పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గురునానక్ నగర్‌లోని తన కార్యాలయంలో మల్లవల్లిలోని పారిశ్రామికవేత్తలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన పరిశ్రమలు వచ్చేందుకు ఆటంకాలు తెలుసుకున్నారు. ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, నాణ్యతగల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫైర్ స్టేషన్, ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నీటి సమస్యను త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. సానుకూలంగా స్పందించిన యార్లగడ్డ పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కంపెనీకి అనుమతుల కోసం ఏపీఐఐసీ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా కొర్రీలు పెట్టి తిప్పడం జరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని యార్లగడ్డ పేర్కొన్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు, అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రతినిధి పాల్గొన్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నిర్మాతలు

గన్నవరంలో సినీ నిర్మాతల సందడి

గన్నవరం, జూన్ 24 : గన్నవరం విమానాశ్రయంలో సినీ నిర్మాతల సందడి నెలకొంది. నగరంలో ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సోమవారం ఇక్కడికి విచ్చేశారు. సినీనిర్మాతలు చలసాని అశ్వనీదత్, అల్లుఅరవింద్, దగ్గుబాటి సురేశ్‌బాబు, యార్లగడ్డ సుప్రియ, యర్నేని నవీన్, టీజీ విశ్వప్రసాద్, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు విచ్చేశారు. అనంతరం వారు రోడ్డు మార్గాన విజయవాడకు తరలివెళ్లారు.

మంత్రి కొల్లుకు నెట్టెం, యార్లగడ్డ శుభాకాంక్షలు



జగ్గయ్యపేట, జూన్ 24 : రాష్ట్ర మైన్స్ ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్రను సోమవారం రాష్ట్ర సచివాలయంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కీలక శాఖల్లో సచివుడిగా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



మచిలీపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కలెక్టర్ చాంబరులో కలెక్టర్ డీకే బాలాజీని సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కలెక్టరేట్‌కు వచ్చిన మండలి బుద్ధప్రసాద్‌కు డీఆర్వో కె.చంద్రశేఖరరావు పూలమొక్కను అందజేశారు. సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథిని తాడిగడపలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమాచారశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పేరంటాలమ్మ సేవలో మురళీమోహన్



గుణదల, జూన్ 24 : రామవరప్పాడులో పేరంటాలమ్మను మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ దర్శించుకున్నారు. సోమవారం తన జన్మదినం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చినట్టు మురళీమోహన్ తెలిపారు. ఆలయానికి వచ్చిన మురళీమోహన్‌ను ఈవో పాతూరి లోకేశ్వరి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి శేషవస్త్రం ప్రసాదం అందజేశారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

27న గురుకులాల్లో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష

వన్‌టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 27వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లాల సమన్వయ అధికారి సుమిత్రాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోగా ఆయా పాఠశాలలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశపరీక్ష ఉంటుందని మెరిట్, రిజర్వేషన్ ఆధారంగానే ఖాళీలు భర్తీ ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఏఏ తరగతులలో ఏఏ గురుకుల పాఠశాలల్లో ఖాళీలు ఉన్నవి ఆమె వివరించారు.

మక్కపేటలో డయేరియా కలకలం!

వత్సవాయి, జూన్ 24 : మండలంలో డయేరియా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సోమవారం గోపినేనిపాలెం నుంచి సపావతు సంధ్య, రామావతు పార్వతి, భీమవరం నుంచి భీమాల సునీతలు మక్కపేటలో ప్రత్యేక వైద్య శిబిరంలో చేరారు. వైద్యాధికారిణి అలేఖ్య ఆధ్వర్యంలో ఏఎల్‌పీహెచ్‌వో సునీత, సీహెచ్‌వో మల్లికార్జునరావు, ఎంపీహెచ్‌వో ఉషారాణిలు వైద్య సేవలందిస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీ పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. మండలంలో ఇప్పటి వరకు 25 మందికి వ్యాధి లక్షణాలు బయటపడగా 10మందిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి పంపినట్టు మిగిలిన వారికి మక్కపేట, వత్సవాయిల్లో చికిత్స అందిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షర్మిత తెలిపారు.

గుంటుపల్లిలో ఇద్దరికి లక్షణాలు..

ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి గ్రామంలో ఇద్దరు డయేరియా లక్షణాలతో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్టు తెలుస్తోంది. డయేరియా భయంతో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. వాతావరణంలో మార్పులు, కలుషిత నీరు తాగడం వల్లే అతిసార బారిన పడినట్టు తెలుస్తోంది.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు


రోగులతో మాట్లాడుతున్న జిల్లా సీపీఐ నేతలు

మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలి

» సీపీఐ నేతల డిమాండ్

జగ్గయ్యపేట : డయేరియా బాధితులను సీపీఐ జిల్లా నేత డి.శంకర్ సోమవారం పరామర్శించారు. జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో సుహాసిని ఇతర అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, డయేరియా మృతులకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పురపాలకసంఘ పరిధిలో పురాతన పైపులైన్లను మార్చి కొత్తవి వేయాలని కోరారు. పురపాలకసంఘం స్పందన దారుణంగా ఉందని విమర్శించారు. పార్టీ నేతలు శివాజీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల చెరలో చేపల చెరువు!

» వేలం నిర్వహిస్తే వీఎంసీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం » ఐదేళ్లుగా జేబులు నింపుకుంటున్న వైసీపీ నేతలు

పాయకాపురం, జూన్ 24 : వీఎంసీ పరిధిలోని కుందావారి కండ్రిక ప్రాంతంలో అక్రమార్కుల చెరలో ఉన్న చేపల చెరువుపై అధికారులు దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా పార్టీ నేతలు చేపల చెరువును స్వాధీనం చేసుకుని లక్షలాది రూపాయలు జేబుల్లో నింపుకున్నారని ఆరోపిస్తున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సిన సొమ్ము ప్రైవేటు వ్యక్తుల పరమవుతున్నా నాటి పార్టీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చెరువును వేలం వేసేందుకు సాహసించలేదన్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో అధికారులు అక్రమార్కుల చెర నుంచి చెరువును విడిపించి వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చాలని కోరుతున్నారు.

చెరువు నేపథ్యం..

స్థానిక 64వ డివిజన్ కుందావారి కండ్రికలోని సర్వే నెం.17లో 33 ఎకరాల చెరువు ద్వారా ఆయకట్టు రైతుల సాగుకు నీరందుతోంది. అయితే చెరువులో అనధికారికంగా వైసీపీ నేతలు చేపల సాగు చేస్తున్నారు. సాధారణంగా చెరువుల్లో చేపల సాగు చేస్తే అధికారులు ఏటా బహిరంగ వేలం నిర్వహించి పాడుకున్న వారికే చెరువును అప్పగించాలి. కానీ వైసీపీ నేతల ఒత్తిళ్లతో నాడు అధికారులు వేలం నిర్వహించలేదు. దీంతో యథేచ్ఛగా చేపల పెంపకం చేపట్టి ఏటా రూ.లక్షల్లో దోచేశారు.


సాగునీటి కోసం వినియోగించే కుందావారి కండ్రిక చెరువు

ఏటా రూ.20 లక్షల ఆదాయం

33 ఎకరాల చేపల చెరువుకు వేలం నిర్వహిస్తే ఏటా వీఎంసీకి రూ.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనాలున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, వీఎంసీ అధికారులు దృష్టి పెట్టకపోవటంతో ఐదేళ్లపాటు వేలం లేకుండానే వైసీపీ నేతలు చేపల సాగుతో అక్రమంగా సంపాదించారు. ప్రభుత్వం మారినా చేపల చెరువును అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి హవా కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును స్వాధీనపరచుకుని వేలం నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌కు ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్, జూన్ 24 : కర్నూలు జిల్లా డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో జూలై 13, 14వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారుల ఎంపికలు పూర్తిచేసినట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లో సర్‌విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఎంపికను చేపట్టినట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి, ట్రెజరర్ కె.రమేష్, జిల్లా పరిశీలకులు వి.రవికుమార్‌లు హాజరయ్యారు. ఎం.తీర్థ సమ్‌దేవ్, పి.కిరణ్, వి.గిరిష్, పి.అభిషేక్‌సాయి, బి.జిష్ణేష్, వై.రోహిత్ మల్లిఖార్జున్, ఎస్.దేవ గణేష్, కె.శక్తిధార్, ఎం.శరత్, వి.దుర్గాతేజ, సీహెచ్.భానుశ్రీ, ఎన్ పావని సరయు, యు.ప్రేమామృత, కె.బూరీశ్వర, ఎం.యజ్ఞ సాయి, ఎం.రామ్‌మణికంఠ, బి.పృథ్వీరాజ్, ఎం.సాత్విక్, కె.కీర్తన, టి.గురుచరణ్, టి.షణ్ముక రాఘవ, జీసీహెచ్ నవశ్రీ, డి.రోమన సావిహిరా, యానా జూన్, ఎ.సత్య సాన్వి, ఎల్.సాయి తన్విశ్రీ, ఎం.సంజన, ఎస్.హర్షిక, బి.దశ్వంత్, ఆకాశ్, జి.జతిన్, కె.వినయ్, వై.రూత్విక్ రాజ్, టి.తారక ప్రవీణ్, కేఆర్‌వీ ప్రసాద్, కె.నిహారిక, ఎం.కేతనశ్రీ, కొంగర సింధుర, మాల్వాలు ఎంపిక య్యారన్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం

» గ్రీవెన్స్ వేదికలో రిటైర్డ్ ఉద్యోగుల గోడు

మచిలీపట్నం టౌన్, జూన్ 24 : తమ సమస్యలు పరిష్కరించాలంటూ నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని బాధితులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించుకున్నారు. మార్చి 4 తరువాత నాలుగు నెలల అనంతరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో రిటైర్డు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు మీడియా ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోతేపల్లిలో పది ఎకరాల భూమిలో 26 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని, ఆ భూములు అసైన్ కేటగిరిలో ఉన్నందు వల్ల విక్రయించుకోలేకపోతున్నామని రిటైర్డు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బి. జయప్రకాష్, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బి.సురేశ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

● ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టైలు, బ్యాడ్జీలతో ఇష్టారాజ్యంగా పేదపిల్లల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహ ఏర్పాటుకు పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించారని, దీనిపై విచారణ జరపాలన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కృష్ణా విశ్వవిద్యాలయ భవన నిర్మాణానికి రూ. 71 కోట్లు మంజూరు చేశారన్నారు. బాలికలకు హస్టల్ నిర్మించలేకపోవడం వల్ల అవస్థలకు గురవుతున్నారన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

● తాగునీరు, సాగునీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేత గౌరిశెట్టి నాగేశ్వరరావు, మలిశెట్టి శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మీడియా ముందు రైతు సంఘ నాయకులు మాట్లాడారు. భారీ వర్షాల సమయంలో 2020 ఏప్రిల్‌లో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో నష్టపోయిన 4500 మంది రైతులకు రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాలని, దీనిపై నాలుగేళ్లుగా కలెక్టరేట్‌కు తిరుగుతూనే ఉన్నామన్నారు. నూతన ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

● గుడివాడ పట్టణంలో నెహ్రూచౌక్, మూడెడ్ల రామారావు సెంటర్‌లో బారికేడ్లు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ప్యూచర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధి మురళీకృష్ణ కోరారు.

డీఎస్సీ (ఎస్‌జీటీ) ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జూన్ 24 : వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఏపీ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బీసీ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ ఎన్టీఆర్ జిల్లా డైరక్టర్ కుమారి ఇ.కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మించని వారు ఇందుకు అర్హులని సంబంధిత సర్టిఫికెట్‌లను నిబంధనల ప్రకారం విజయవాడ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విజయవాడ పండిటీపురం రోడ్డు నెంబర్-8లో గల అశోక్‌నగర్‌లోని స్టడీ సర్కిల్ కార్యాలయంలో గాని 950094349, 7981448836 నెంబర్‌లలో గాని సంప్రదించవచ్చన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై వినతి

మొగల్రాజపురం, జూన్ 24 : ప్రజా పంపిణీ వ్యవస్థలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రేషన్ డీలర్ల సంఘం నేతలు వినతి పత్రం రూపంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. శనివారం అశోక్‌నగర్‌లోని పౌరసరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రికి డీలర్ల సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ప్రజాపంపిణీలో ఎండీయూ వ్యవస్థ చట్ట విరుద్ధంగా ప్రవేశపెట్టారని దీనిని పునఃపరిశీలించాలని, సంక్షేమ నిధి ఏర్పాటు, 2021లో డీలర్ల నుంచి తీసుకున్న గన్నీ సంచులకు డబ్బులు ఇప్పించాలని, కరోనాతో చనిపోయిన డీలర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని తదితర అంశాలను వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్, విజయవాడ వర్కింగ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల పునరుద్ధరణ

రైల్వేస్టేషన్, జూన్ 24 : విజయవాడ రైల్వే డివిజన్‌లోని నిడదవోలు-కడియం మధ్య ట్రాఫిక్ నిర్వహణ కారణంగా రద్దుచేసిన పలు రైళ్ళను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నారు. 12805 విశాఖపట్నం లింగపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నారు. 12806 రైలును ఈ నెల 26 నుంచి పునరుద్ధరిస్తున్నారు. 17643 చంగల్‌పట్టు కాకినాడ పోర్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి, 17644 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24 నుంచి పునరుద్ధరిస్తున్నట్టు డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూప్కర్ తెలియజేశారు. 17258, 17257 ఎగువ, దిగువ విజయవాడ-కాకినాడ పోర్ట్ రైలును కూడా పునరుద్ధరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ సంపత్ కుమార్

సమస్యలకు సత్వర పరిష్కారం

వన్‌టౌన్, జూన్ 24 : అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నుంచి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 69 అర్జీలను జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలకు సమర్పించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. వినతులను కులంకషంగా పరిశీలించి జిల్లా స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కోరారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించి 31, పోలీసులకు సంబంధించి 9, ఎన్ఏయూడీకు సంబంధించి 7, ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్‌కు సంబంధించి 5, విద్యావిభాగానికి సంబంధించి 3, ఉపాధి విభాగానికి సంబంధించి 2, ఆరోగ్యానికి సంబంధించి 2, వ్యవసాయానికి సంబంధించి 1, సర్వే సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1, డీఆర్‌డీఏ, ఎండోమెంట్, పంచాయితీ రాజ్, తదితర విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ కె.ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు!


మరమ్మతులకు నోచని వేదాద్రి ఎత్తిపోతల పథకం


ధ్వంసమైన పైపులైన్లు

అన్నదాతకు జలసిరులందించి వ్యవసాయరంగానికి ఆసరాగా నిలిచిన ఎత్తిపోతల పథకాలు బలోపేతం దిశగా అడుగులు పడుతున్నాయి. శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆ దిశగా చొరవ తీసుకోవడంతో మెట్ట రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పథకాలు సీఎం చంద్రబాబు సహకారంతో తిరిగి జీవం పోసుకోనున్నాయి.

» మెట్ట రైతుకు ఊరట
» ఎత్తిపోతలకు తీరనున్న కష్టాలు
» ఐదేళ్లుగా మరమ్మతులకు నోచని పథకాలు
» సీఎం చందబాబు దృష్టికి ప్రస్తుత పరిస్థితి
» సౌమ్య చొరవతో అన్నదాతల హర్షాతిరేకాలు

నందిగామ : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సుమారు ఎనభై ఎత్తిపోతల పథకాలు ఉండగా, ఒక్క నందిగామ నియోజకవర్గంలోనే 63 పథకాలు ఉన్నాయి. వీటి ఆయకట్టులో సుమారు 74 వేల ఎకరాల భూమి సాగవుతుంది. 70వ దశకంలో డాక్టర్ కేఎల్‌రావు చొరవతో ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగింది. పక్కనే కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా వ్యవసాయానికి చుక్క నీరు పొందలేక రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. ఎత్తిపోతల పథకాలతో ఆయకట్టు రైతుల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి.

● 1995 తరువాత నియోజకవర్గ సాగునీటి వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఎమ్మెల్యేగా ఉన్న దేవినేని వెంకటరమణ ఎత్తిపోతల పథకాల నిర్మాణంపై దృష్టి సారించారు. అప్పట్లోనే రూ.8 కోట్ల వ్యయంతో వేదాద్రి ఎత్తిపోతల నిర్మాణానికి నడుంబిగించారు. ఆయన హయాంలో పలు పథకాలు ప్రారంభమయ్యాయి. ఆయన మరణంతో ఎమ్మెల్యేగా దేవినేని ఉమామహేశ్వరరావు పదేళ్లపాటు కృష్ణా, మునేరు నదులపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి కృషి చేశారు. ఫలితంగా నియోజకవర్గంలో 74 వేలఎకరాల భూమి స్థిరీకరించబడింది. తంగిరాల ప్రభాకర్ హయాంలోనూ పథకాల అభివృద్ధి పనులు కొనసాగాయి. పథకాలను రైతు కమిటీలకు అప్పగించినా వాటి ఆలనా పాలన విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఒక కంట కనిపెట్టుకొని ఉండేది.

● గత టీడీపీ పాలనలో పలు పథకాలు మరమ్మతులకు గురికాగా ఆయకట్టుకు నీరందించలేక పోవడంతో అప్పట్లో జలవనరుల శాఖా మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు రెండు విడతలుగా 80 కోట్ల రూపాయలతో పథకాలకు మరమ్మతులు చేయించి అన్నదాతలకు ఆసరాగా నిలిచారు. దాంతో కొంతకాలం ఆయకట్టుకు సమర్థవంతంగా నీరందించాయి.

వైసీపీ పాలనలో పథకాలకు గ్రహణం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకాలకు గ్రహణం పట్టింది. రైతు ప్రభుత్వం అంటూ కోతలు తప్ప ఎత్తిపోతలకు ఆ ప్రభుత్వంలో ఆదరణ లభించలేదు. పథకాలు ఏటేటా దెబ్బతింటున్నా కనీస నిధులు కూడా కేటాయించలేదు. ఫలితంగా యాభైకి పైగా పథకాలు పని చేయడం లేదు. 17వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరందించే ప్రతిష్టాత్మకమైన వేదాద్రి ఎత్తిపోతల మూతపడింది. అనేక పథకాలలో మోటార్లు మరమ్మతులు లేక నిలిచిపోయాయి. కొన్నిచోట్ల మోటార్లు, విద్యుత్ సరఫరా పరికరాలు చోరీకి గురయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంఘాలు కూడా అందినకాడికి దోచుకొని పథకాలను మూలనపెట్టాయి.

చంద్రబాబు రాకతో చిగురిస్తున్న ఆశలు


ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులివ్వాలని చంద్రబాబును కోరుతున్న ఎమ్మెల్యే సౌమ్య

మెట్ట ప్రాంతంలో ఏ నియోజకవర్గానికి లేని వనరుగా నందిగామకు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఆ వనరుల పరిరక్షణ ద్వారా రైతుకు అండగా నిలవడం ఎమ్మెల్యేగా సౌమ్య బాధ్యత. సాగునీటి రంగం పట్ల చిత్తశుద్ధి గల చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల శిథిలావస్థకు చేరిన పథకాలకు జీవం పోయడమే తొలి ప్రాధాన్యంగా ఆమె భావిస్తోంది. ఈక్రమంలోనే తొలిగా వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అంచనాలు రూపొందించి అసెంబ్లీ సమావేశాలలో తన అభ్యర్థనను చంద్రబాబుకు అందజేశారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. వేదాద్రితో ప్రారంభమైన ఈ యజ్ఞం కృష్ణా, మునేరు నదులపై ఉన్న 63 పథకాల మరమ్మతుల వరకూ కొనసాగాలని రైతులు కోరుతున్నారు. అధికారుల అంచనా ప్రకారం నందిగామలోని అన్ని పథకాలు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించాలంటే కనీసం రూ. 100 కోట్లు అవసరమౌతాయని చెబుతున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి సమర్థవంతమైన కమిటీలకు అప్పగిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమౌతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే ఎమ్మెల్యే వెంట తాము కూడా నడిచి తమ విజ్ఞప్తిని చంద్రబాబుకు విన్నవించాలని భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్, జూన్ 24 : డయేరియా ప్రబలకుండా రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని బాపులపాడు ఎంపీడీవో కె. రత్నకుమారి పంచాయతీ, ఇంజనీరింగ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలపై పంచాయతీ, ఇంజనీరింగ్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి వారం రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయాలని, పైపులైన్లు ఎక్కడ లీకులు లేకుండా చూడాలని సూచించారు. ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న ఆర్వో ప్లాంట్ల నుంచి శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భారంగా బకాయిలు!

- మొండిగా మారిన పన్ను వసూళ్లు
- దాదాపు రూ. 4కోట్లు బకాయిలు
- తలనొప్పిగా బాపులపాడు గ్రామ పంచాయతీ నిర్వహణ
- రెండు నెలలకొకసారి కార్మికుల వేతనాలు
- సుదీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారికి కోర్టు నోటీసులు



బాపులపాడు గ్రామపంచాయతీ కార్యాలయం (ఫైల్)

హనుమాన్‌జంక్షన్, జూన్ 24: బాపులపాడు గ్రామపంచాయతీకి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. పారిశుధ్య సిబ్బందికి వేతనాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి పంచాయతీకి వచ్చింది. రెండు నెలలకొకసారి పారిశుధ్య కార్మికులు వేతనాలు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. పంచాయతీకి ఇళ్లపన్ను, నీటి కుళాయి పన్నులే ఆదాయం. దాదాపు రూ.4కోట్లు బకాయిలు రావాల్సి ఉండడంతో నిర్వాహణ పెనుభారంగా మారింది. ఇళ్ల పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోవడానికి గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. ఇంటి పన్నులు రాకపోవడంతో అరకొరగా వచ్చే ఆర్థిక సంఘం నిధులను అభివృద్ధి పనులకు సరిపెడుతున్నారు. గ్రామంలో 4వేలు పైచిలుకు గృహాలు ఉన్నాయి. ఇంటి పన్ను రూపంలో ఏడాదికి దాదాపు కోటిరూపాయలు ఆదాయం రావాల్సి ఉంది. నీటి కుళాయి పన్ను మరో రూ.1కోటి వరకు ఉంది. సుదీర్ఘకాలంగా దాదాపు వెయ్యి గృహాలు ఇళ్ల పన్ను చెల్లించని పరిస్థితిని పంచాయతీ ఎదుర్కొంటోంది. పన్నులు పాతబకాయిలు, గత ఆర్థిక సంవత్సరం బకాయిలు రూ.3కోట్లు ఉన్నట్లు తెలిసింది. గ్రామ పంచాయతీ సిబ్బంది పన్ను వసూళ్లపై ప్రజలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇళ్లపన్ను, నీటికుళాయి బకాయిలుపై ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్న ఫలితం కనిపించకపోవడంతో నిర్వాహణ ఇబ్బందిగా మారిందని పాలక వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇళ్ల పన్నులు చెల్లించని వారికి కోర్టు నోటీసులు జారీ చేస్తున్నారు. నీటి కుళాయి పన్ను బకాయి ఉన్న వారి కుళాయి డమ్మీలు వేస్తున్నారు. ఈ ఏడాది గ్రామ పంచాయతీలో దాదాపు 60 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరి వేతనాలకే దాదాపు కోటి రూపాయలు ఖర్చు అవుతున్న పరిస్థితి ఉంది. సక్రమంగా ఇళ్ల పన్నులు వసూళ్లు అయితే కార్మికుల వేతనాలకు సరిపోతుంది. ఇతర అవసరాలు, వీధిలైట్లు నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి నిర్వహణ అవసరాలు సైతం పన్ను ఆదాయంపైన ఆధారపడి ఉందని పాలక వర్గ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అనుమోలు ప్రభాకరరావు

నోటు పుస్తకాల పంపిణీ

పెనమలూరు, జూన్ 24 : పోరంకి జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదినం సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు, అన్ని శాఖల అధికారులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విషయం పాఠకులకు తెలిసిందే.. ఈక్రమంలో బోడె ప్రసాద్‌కు కొంతమంది విద్యావేత్తలు, టీడీపీ శ్రేణులు నోటుపుస్తకాలను బహుమతులుగా అందజేశారు. వాటిని విద్యార్థులకు అందజేశారు. ఆయన వెంట ఆకునూరు కోటేశ్వరరావు, ప్రవీణ్, బొంగరాల అబ్రహం ఉన్నారు.

మంత్రి కొల్లు ప్రత్యేక పూజలు



కంకిపాడు అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

కంకిపాడు, జూన్ 24 : ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించటంలో తన వంతు కృషిచేస్తానని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్తూ కంకిపాడు అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రానున్న వారంలో రోజుల్లో నూతన మద్యం పాలసీని అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజా పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఎక్సైజ్, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్రకు ఉయ్యూరుకు చెందిన పుప్పాల శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో సోమవారం ఆయనను కలసి జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపి ప్రజలకు మెరుగైన సేవలందించి మంచి పేరుప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు.

గన్నవరం : రాష్ట్ర ఎక్సైజ్, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కలిశారు. బాధ్యతలు స్వీకరించిన కొల్లు రవీంద్రకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి రవీంద్రకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

డ్వాక్రా గ్రూపుపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్, జూన్ 24: పెరికీడు గ్రామానికి చెందిన విజయ డ్వాక్రా గ్రూపు నిర్వాహకులు అవినీతికి పాల్పడినట్లు సోమవారం గ్రూపు సభ్యులు జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రూపు సభ్యులను మోసం చేసి నిర్వాహకులు వీఓఏ సహకారంతో రూ.10లక్షలు అక్రమంగా వాడుకుని సభ్యులను మోసం చేశారంటూ గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై జనార్దన్ ప్రాథమిక విచారణ చేపట్టినట్లు తెలిసింది.

ప్రజాదర్బార్‌కు ఆరు అర్జీలు

బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ఆరు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. రెవెన్యూకు సంబంధించి రెండు, విద్యాదీవెన రెండు, సామాజిక పింఛన్లు రెండు అర్జీలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి ఆయా శాఖలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

బోడె చొరవతో శ్మశాన వాటిక ఆక్రమణ సమస్య పరిష్కారం



ప్రొద్దుటూరు శ్మశాన వాటికకు గోడ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ప్రొద్దుటూరు (కంకిపాడు), జూన్ 24 : ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలకు గురైన శ్మశాన వాటిక స్థల సమస్యను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవతో పరిష్కరించారు. ప్రొద్దుటూరులోని శ్మశాన వాటిక స్థలాన్ని కొన్నేళ్ల క్రితం ఒక రైతు ఆక్రమించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్యను టీడీపీ మండల నాయకుడు పావనమూర్తి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు సోమవారం ఆక్రమణలు తొలగించి శ్మశానవాటిక చుట్టూ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

యార్లగడ్డ ఆధ్వర్యంలోనే అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 24 : పంచాయతీ నిధులను దారిమళ్లించి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కటకటలాడే పరిస్థితి కల్పించి గత ప్రభుత్వం ప్రజలకు పాలనను దూరం చేసిందని సర్పంచ్‌లు కాటూరు విజయభాస్కర్, యజ్జవరపు వెంకటరంగరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసినందున మొక్కు చెల్లించేందుకు సోమవారం తిరుమలలో కాలినడకన మెట్లు ఎక్కి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: ఆళ్ల



మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 24 : గత ప్రభుత్వ ఆరాచకపాలనపై పోరాటం చేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులను ఎత్తివేయాలని హోంమంత్రి వంగలపూడి అనితను ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. హోంశాఖ కార్యాలయంలో మంత్రి అనితను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. యువగళం సందర్భంగా రంగన్నగూడెంలో టీడీపీ శ్రేణులపై పెట్టిన కేసులు తదితర విషయాలను హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమ కేసులపై త్వరలోనే సమీక్ష నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హామీ ఇచ్చినట్లు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్యచౌదరి, గుత్తా శివరామకృష్ణ, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొండలో వైరస్ తెగుళ్లపై అవగాహన



దొండ రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త వీరబాబు

చినఓగిరాల(ఉయ్యూరు), జూన్ 24 : దొండపంటలో వైరస్ ఆశించకుండా ముందుగనే శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పంట కాపాడుకోవచ్చని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ శాస్త్రవేత్త వీరబాబు తెలిపారు. చినఓగిరాల లో సోమవారం దొండ సాగుచేసే రైతులతో సమావేశం నిర్వహించి దొండలో వైరస్ తెగుళ్లపై అవగాహన కల్పించారు. మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్‌లో చిన్న సన్నకారు రైతులు పండ్ల తోటలు, కొబ్బరి, ఆయిల్, మునగ వంటి ఉద్యాన పంటలు సాగుచేసి రాయితీలు పొందవచ్చని మండల ఉద్యాన అధికారి నాగదేవిశ్రీ తెలిపారు. ప్లాంట్‌ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.దక్షిణామూర్తి, అసిస్టెంట్ ఆఫీసర్ టి.ప్రేమరంజితం పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథికి అభినందన



పెనమలూరు, జూన్ 24 : కృష్ణాజిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఉప సంచాలకులు ఎం వెంకటేశ్వర ప్రసాద్ మంత్రి కొలుసు పార్థసారథిని వందడుగుల రోడ్డులోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో సత్కరించారు.

దాతల సాయంతో క్రీడాప్రాంగణం అభివృద్ధి

గన్నవరం, జూన్ 24 : దాతల సాయంతోనే క్రీడాప్రాంగణం మరింత అభివృద్ధి సాధ్యమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవిఆర్ కిషోర్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణం వాకర్స్ అసోసియేషన్ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ, తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత సుమారు రూ.4.50 లక్షల సొంత నిధులు వెచ్చించి క్రీడా మైదానం అభివృద్ధికి తనవంతు కృషి చేసినట్లు తెలిపారు. క్రీడా మైదానంలో మరింత అభివృద్ధికి ట్రాక్ నూతనంగా ఏర్పాటు, ఓపెన్ జిమ్‌కు రక్షణ వలయం, ఫ్లాట్ ఫారమ్ ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. టీఎస్ఆర్‌కే ప్రసాద్ రూ.25వేలు, తిరివీధి వెంకయ్య రూ.10వేలు, షేక్ సైఫుద్దీన్ రూ.10వేలు, వెలివేటి శివాజీ రూ.10వేలు సగ్గుర్తి శ్రీనివాసరావు, జున్ను నారాయణరావు, ముక్కామల సుబ్బారావు, పీఎస్ఎస్ఎన్ శ్రీనివాస్, వీరంకి శ్రీనివాస రావు, బ్రహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఎలీషాలు రూ.5వేలు చొప్పున విరాళాలు అందజేశారు.



ఉయ్యూరు సెంటర్‌లో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ఉయ్యూరు, జూన్ 24 : ఉయ్యూరులో ట్రాఫిక్ నియంత్రణకు ఎట్టకేలకు పోలీసులు చర్యలు చేపట్టారు. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు, శివాలయం రోడ్డు, కాటూరురోడ్డు, పాతస్టేట్‌బ్యాంక్ రోడ్డుతో పాటు ప్రధాన సెంటర్‌లో రింగ్ వద్ద అడ్డదిడ్డంగా నిలుపుతున్న ఆటోలు, తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలతో ట్రాఫిక్ సమస్య నానాటికి జఠిలమవుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులను 'ట్రాఫిక్‌తో ప్రజల అవస్థలు' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పోలీసులు రోడ్డుపైకి వచ్చి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎస్సై గణేశ్‌కుమార్ సిబ్బంది సెంటర్‌లో నిలుచుని ట్రాఫిక్ అంతరాయం కలిగించేవారిపై చర్యలు తీసుకున్నారు.

చిన్నారుల మేధో వికాసానికి అంగన్వాడీలు



పెదఅవుటపల్లి అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

ఉంగుటూరు, జూన్ 24 : చిన్నారుల మేధో వికాసానికి, శారీరక ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని పెదఅవుటపల్లి సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ అన్నారు. సోమవారం పెదఅవుటపల్లిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే సందడిగా సాగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గన్నవరం, జూన్ 24 : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక వీకేఆర్ కళాశాల్లో సోమవారం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని తెలిపారు. ఒకప్పుడు పట్టణాలు, నగరాలకే పరిమితమైన మత్తు పదార్థాల జాడ్యం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు పాకిందన్నారు. మత్తు పదార్థాలు వివిధ రూపంలో కళాశా లలు, పాఠశాలల విద్యార్థులకు చేరుతున్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి విక్రయించిన, వినియోగించిన నేరమేనని తెలిపారు. ఎస్సై శివ ప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీ



వీకేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో..

ఉయ్యూరు : మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటలక్ష్మి, ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. డ్రగ్స్ రహిత సమాజంలో భాగంగా సోమవారం మత్తుపదార్థాల వినియోగం, దుష్పరిణామాలు, మత్తుపదార్థాల వినియోగం, కలిగి ఉన్నవారిపై చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పిస్తూ ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై గణేశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వతనేని



మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్న పర్వతనేని

కంకిపాడు, జూన్ 24 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం నిరంతరం పోరాడుతుందని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వతనేని శ్రీనివాస్ అన్నారు. మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం ఆయన చాంబర్‌లో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కంకిపాడులో విలేకరులతో పర్వతనేని శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు సరైన గుర్తింపు ఇవ్వలేదని, సీపీఎస్ రద్దు చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించారని మండిపడ్డారు. పదోన్నతులు కల్పించటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం వచ్చిందని తెలిపారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

ఉంగుటూరు, జూన్ 24 : వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వుండే విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు ఉంగుటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కాట్రగడ్డ వాణి తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని తేలప్రోలు సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో సర్పంచ్ లాం దిబోరా సహకారంతో వైద్యఆరోగ్యశాఖ బృందం సోమవారం దోమలమందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ ఆర్.వెంకట్రావు, హెల్త్ సూపర్‌వైజర్ సాల్మన్ రాజు, ఏఎన్ఎం సుకన్య, హాస్టల్ వార్డెన్ జి.శ్రీను, కార్యదర్శి వి.కృపారావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

గన్నవరం, జూన్ 24 : మండలంలోని జక్కులనెక్కలానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక కార్యకర్త నండూరు విశ్వనాథం అర్జీ అందజేశారు. గూడవల్లి నుంచి గ్రామానికి వెళ్లే సుమారు రెండు కిలోమీటర్లు వరకూ రోడ్డు ఉందని దానిపై తారు మొత్తం పోయి గుంతలు పడ్డాయన్నారు. పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.15

ఎంపీ కేశినేని చిన్నికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుభాకాంక్షలు



గుడివాడ : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన మిత్రుడు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఢిల్లీ తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ఆవరణలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి కొల్లు రవీంద్రకు అభినందనలు తెలుపుతున్న కొనకళ్ల, గోపు సత్యనారాయణ

కృష్ణాజిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

● మంత్రి రవీంద్ర ప్రమాణ స్వీకారానికి భారీగా తరలివెళ్లిన కూటమి శ్రేణులు

మచిలీపట్నం టౌన్, జూన్ 24 : ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్, జియాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా సోమవారం మచిలీపట్నం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అమరావతి తరలి వెళ్లారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు,నాయకులు రామధాని వేణు, పివిఫణికుమార్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, తలారి సోమశేఖర్, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, యార్లగడ్డ సీతారామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ తదితరులు తరలి వెళ్ళారు. కొల్లు రవీంద్ర నీలిమ దంపతులను శాలువాతో సత్కరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ కూటమి విజయానికి ఎలా సమిష్టి కృషి చేసామో అదే రీతిలో జిల్లా అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు.

ప్రజా మన్నన పొందిన నేత పరుచూరి

● బోస్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



బోస్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల, జూన్ 24 : ప్రజల మన్నన పొందిన నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఘంటసాల మండల టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం తాడేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ పరుచూరి సుభాష్ చంద్రబోస్‌చే పుట్టిన రోజు కేక్ కట్ చేయించి శుభా కాంక్షలు తెలియజేశారు. కూటమి నేతలు మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, పరిశె చలపతి, యార్లగడ్డ వీరభద్రరావు, గుత్తికొండ వరప్రసాద్, అయినపూడి భాను ప్రకాష్, బంగారు బాబు, ఆవుల ధర్మ వెంకట నరసయ్య, గాజుల నాగ శ్రీనివాసరావు, తాడికొండ చిన్న, దిరిశం వెంకట్రావు, దిరిశం బాలకోటయ్య, మునిపల్లి బుజ్జి, సూరపనేని శివరామ ప్రసాద్, దండమూడి శివనాగేశ్వరరావు, కుంపటి సుబ్బారావు, కుంపటి ఉదయ్, అంబటి వెంకటేశ్వరరావు, చిర్ల రామకృష్ణ, కొడాలి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. బోస్ యూత్ సభ్యులు ఘంటసాల, చిన్నకళ్లేపల్లి, శ్రీకాకుళం గ్రామాల్లోని ఎస్టీలకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు.

శివరామక్షేత్రానికి రూ.1,01,116 విరాళం



కోడూరు : కోడూరులోశివరామ కృష్ణ క్షేత్రం (శివాలయం) పునర్నిర్మాణానికి జయపురం గ్రామానికి చెందిన కనకమేడల రామబ్రహ్మం కుటుంబసభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. సోమవారం ఆలయ కమిటీ వారు రామ బ్రహ్మం ఇంటి వద్ద విరాళాన్ని అందుకున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్ బాబు, బడే భావ న్నారాయణ, అన్నం దానారావు, అన్నం శివరామకృష్ణ, ఉల్లి రంగారావు, అన్నం సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సేవ దుర్గమ్మ ఆరాధనతో సమానం



మచిలీపట్నం టౌన్, జూన్ 24 : పేద , అనాథ విద్యార్థినులకు సాయం అందిస్తే దుర్గామాతను ఆరాధించిన పుణ్యఫలం చేకూరుతుందని గుడివాడ ప్రణవాశ్రమం స్థైర్యానంద సరస్వతి స్వామి అన్నారు. మానవత స్వ చ్ఛంద సేవా సంస్థ బాలికల ఉచిత హాస్టల్‌లో సోమవారం గణపతి హోమం నిర్వహించారు స్వామీజీ అభిభాషణం చేశారు. పేద విద్యార్థినుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, ధార్మిక అంశాలపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. స్టార్ కళాశాల అధినేత బి.శ్రీరాం రూ.5 వేలు బి.సురేష్ రూ.4 వేలు విరాళంగా అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయి కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ శాయన సుశీల్‌రావు, హాస్టల్ నిర్వాహకులు తలశిల దామోదర్, కె.చంద్రశేఖర్, విశ్రాంత ఎంఈవో కారుమూరి రాజేంద్రప్రసాద్, అశోక్, డాక్టర్ బి.కె.మల్లిఖార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం



చల్లపల్లి : చల్లపల్లిలోని గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శాంతి కల్యాణం కన్నులపండువగా జరిగింది. వరదా హరిగోపాల్..నాగమణి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణోత్సవం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోత్రం రఘునాథా చార్యులు, భార్గవాచార్యులు, రంగనాథాచార్యులు, శేషాచార్యులు శాంతి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఖో-ఖో పోటీల్లో గుడివాడ విద్యార్థులకు బంగారు పతకాలు



గుడివాడ : అండర్-17వ బాల బాలికల సౌత్‌జోన్ జాతీయ స్థాయి ఖో-ఖో ఛాంపియన్ షిప్ పోటీల్లో ఎస్‌పీఎస్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించటం అభినందనీయమని హెచ్‌ఎం రాణి అన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు మడక ప్రసాద్‌ను డీవైఈవో పద్మారాణి, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శి ఎస్.కె.జాన్ సాహెబ్, విద్యా కమిటీ చైర్మన్ గుడివాడ సుమిత్ర కుమార్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సత్య ప్రసాద్, ఖో-ఖో అసోసియేషన్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు ప్రత్యేకంగా అభినందించారు.

మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తు పాడుచేసుకోవద్దు



చల్లపల్లి, జూన్ 24 : యువత మాదకద్రవ్యాలకు బా నిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని డీఎస్పీ పి.మురళీధర్ అన్నారు. చల్లపల్లి విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెడువ్యసనం మనిషి ఎదుగుదలను నిరోధిస్తుందన్నారు. ఉజ్వల భవితకు అవరోధంగా మారుతుందన్నారు. సమాజంలో విలువలు తగ్గిస్తుందన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో చదువుకోవాలనీ, జీవితంలో స్థిరపడి మంచిపేరు తెచ్చుకోవాలనీ, వ్యసనాల బారిన పడవద్దని సూచించారు. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ దుట్టా శివరాంప్రసాద్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మోపర్రు తాగునీటి చెరువు, ప్రజలకు సరఫరా చేసిన పసర్ల నీరు



పెంటపోగులు వేయడంతో పుట్టగుంట చెరువు నీరు కలుషితమవుతోందని చూపుతున్న ప్రసాద్‌రెడ్డి



కమ్మనమోలు తాగునీటి చెరువులో పసర్లుగా ఉన్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కూటమి నేతలు

తాగునీటి చెరువులు కలుషితం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే అతిసార కోరలు చాచింది. కలుషిత నీరే ప్రధాన కారణంగా ఉంది. ఈ పరిస్థితుల్లో పెదపారుపూడి మండలం మోపర్రు, నందివాడ మండలం పుట్టగుంట గ్రామాల్లో తాగునీటి చెరువులు కలుషితమై, పచ్చటి నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. అధికారులు, పాలకులు అప్రమత్తమై కలుషిత నీటి సమస్యను పరిష్కరించకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది.

పెదపారుపూడి : మోపర్రు గ్రామంలో తాగునీటి చెరువు కలుషితమై మంచినీళ్లు పచ్చని రంగులో ఉంటున్నాయని, వాటిని తాగటం వల్ల వ్యాధుల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ ఎక్కువ మంది చెరువు నీటి మీదే ఆధారపడి ఉన్నారన్నారు. తాగటానికి పనికి రాకుండా పోయాయని తెలిపారు. ఇంట్లో వాడకాలకు కూడా వాడుకోవటానికి పసర్లతో నీళ్లు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో 50-60 సంవత్సరాల నుంచి చెరువు నీటిని తాగుతున్నామని, ఫిల్టర్లు సరిగా పని చేయకపోవటం వల్లే నీళ్లు రంగు మారాయ ంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కలుషిత నీటిని శుద్ధి చేసి శుభ్రమైన నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈవోపీఆర్‌డీ వంశీని వివరణ కోరగా, ఉదయం పూట నీటిని తాగటానికి క్లోరినేషన్ చేసి ఇస్తున్నామని, తర్వాత వాడకానికి డైరెక్ట్‌గా ఇస్తున్నామన్నారు. వాడకం నీటిని కూడా కూడా క్లోరినైజ్ చేయమని పంచాయతీ కార్యదర్శి సాంబశివరావుకు చెప్పటం జరిగిందన్నారు.

మోపర్రు, పుట్టగుంట గ్రామాల్లో పొంచి ఉన్న ముప్పు

పుట్టగుంటలో కలుషితం అవుతోందిలా..

నందివాడ (పుట్టగుంట) : పుట్టగుంట మంచినీటి చెరువు నీరు కలుషితమైందని, ఆ నీటినే గ్రామ పంచాయతీ ప్రజలకు అందిస్తున్నందున డయేరియా వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు గొన్నూరు కాశీ విశ్వనాథ్ ప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల కాలంలో తాగునీటి చెరువు కలుషితంపై స్పందన కార్యక్రమంలో 69 సార్లు అర్జీలు ద్వారా ఫిర్యాదు చేశానన్నారు. పంచాయతీ అధికారులు సమస్యలు పరిష్కరించకపోగా, పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు తరచూ తనను బెదిరిస్తూ వస్తున్నారన్నారు. వాళ్ల బెదిరింపులకు భయపడకుండా స్పందనలో అర్జీలు ఇస్తూనే ఉన్నానని అన్నారు. స్పందనలో 69 అర్జీలు ఇస్తే ఒక్క దానికి కూడా సమాధానం రాలేదన్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నామన్నారు. మంచినీటి చెరువుకు నీళ్లు పెట్టే కాలువ సైతం ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. మంచినీటి చెరువు చుట్టూ పెంట పోగులు వేయడంతో మురుగు నీరంతా మంచినీటి చెరువు లోనే కలుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు శ్రద్ధ వహించి చెరువు చుట్టూ ఉన్న పెంట పోగులను తొలగించి చెరువు కలుషితం కాకుండా కలువకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌ను వివరణ కోరగా, రెండు రోజుల్లో చెరువు చుట్టూ ఉన్న పెంట పోగులను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తామన్నారు.



మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఎమ్మెల్యే మండలి కమ్మనమోలు రక్షిత నీటి పథకం సందర్శన

నాగాయలంక : తీర ప్రాంత ప్రజలకు రక్షిత తాగునీరును అందించటంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నా రు. కమ్మనమోలులోని 15 గ్రామాలకు సరఫరా చేసే సామూహిక రక్షిత తాగునీటి పథకాన్ని బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.సత్యనారాయణ, ఏఈ కె.కిషోర్‌లతో సమస్యపై చర్చించారు. . సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లి నిధులు సాధ్యమైనంత వేగంగా మంజూరు చేయి స్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి తక్షణం ట్యాంకర్ల ద్వారా ప్రజలకు మంచినీరు అందిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్థిరావు, మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత మల్లేశ్వరం రక్షిత నీటి పథకం సందర్శన

బంటుమిల్లి : ఇంటింటికి తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్న నేపథ్యంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్‌లు బాగుచేసి మంచినీరు అందించాలని కాగిత అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తక్షణమే గ్రామాలలో తాగు నీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసాద్, డీఈ నటరాజ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం



మచిలీపట్నం టౌన్, జూన్ 24 : రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని కృష్ణవేణి ఐటీఐ కళాశాల సెక్రటరీ కె.రమేష్ అన్నారు. సోమవారం కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో మా దక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సు జరిగింది. పవిత్ర డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో చిలకలపూడి సీఐ సతీష్, స్టార్ కళాశాల అధినేత శ్రీరామ్ తదితరులు మాటాడుతూ, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై వీఆర్వోల ఫిర్యాదు

చల్లపల్లి : యార్లగడ్డ వీఆర్వో పామర్తి కోటేశ్వరరావు పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ, జీతం బిల్లులు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని యార్లగడ్డ పంచాయతీ కార్యదర్శి హరీష్‌పై వీఆర్వోలు ఫిర్యాదు చేశారు. తన మాటవినకుండా, తనకు చెప్పకుండా ఎక్కడకూ వెళ్లరాదంటూ ఆంక్షలు విధిస్తున్నారని బెదిరిస్తున్నారన్నారు. గతంలోనూ జీతం బిల్లు పెట్టకపోవటంతో తహసీల్దార్, ఎంపీడీవో దృష్టికి తీసుకువెళితే బిల్లు పెట్టారన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ బి.సుమతికి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కోటేశ్వరరావుతోపాటు వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పరిశ కిరణ్‌కుమార్, వీఆర్వోలు అమలేశ్వరరావు, కిరణ్, శ్రీనివాసరావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పెడన మున్సిపాల్టీలో మీకోసం

పెడన : మునిసిపాలిటీలో మీ కోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను సోమవారం నుంచి తిరిగి ప్రారంభమయింది. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కమిషనర్ బి. వెంకట్రామయ్య అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై మొత్తం నాలుగు అర్జీలు వచ్చాయి.

వైభవంగా విరుగులమ్మ జాతర

నాగాయలంక : నంగేగడ్డ విరుగులమ్మ జాతర ఆదివారం రాత్రి వైభవంగా ముగిసింది. భక్తులు విరివిగా వచ్చి మొక్కుబడులను చెల్లించుకున్నారు. యువ నేత మండలి రాజా, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షుడురత్నగోపాల్, జనసేన నాయకులు చిలకలపూడి పాపారావు, నాగాయలంక మండల ఉపాధ్యక్షులు పాపారావు, విజ య్, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన నేతలు అన్నసంతర్పణ చేశారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఓల్డ్ టౌన్ మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు యాదవ సంఘం రాష్ట్ర నాయకులు పులిపాక రామమోహనరావు వితరణతో గొడుగులు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్, బొగ్గరపు తిరుపతయ్య, సయ్యద్ గఫార్, పల్లపోతు వెంకట నాగబాబు, కంతేటి హరిబాబు, జాజుల తాతారావు, పాఠశాల హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

గుడివాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీడీవో జ్యోతి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమం జరిగింది. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏఈవో అనిత, ఎంఈవో బాలాజీ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

మీకోసం సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర చేపట్టిన మీకోసం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీపల్లవి అన్నారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మూడు అర్జీలు వచ్చాయన్నారు. ఎంపీడీవో భారతి, ఏవో శివనాగరాణి, ఎంఈఓ పద్మవాణి, పంచాయతీరాజ్ ఏఈ నరసయ్య, డీటీ మలేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పమిడిముక్కల : పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే డయేరియా బారిన పడకుండా జీవించ వచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష అన్నారు. పమిడిముక్కల ఆరోగ్యకేంద్రం-3లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం డయేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిదన్నారు. ఏఎన్ఎం డీవీ లక్ష్మి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రం పిల్లల తల్లులు పాల్గొన్నారు.

కన్పించకుండా పోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

పెడన : మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. ఈనెల 16 నుంచి కనిపించకుండా పోయిన పెడన 14వ వార్డుకు చెందిన వెనిగళ్ళ వెంకట శివరామకృష్ణ (40) ఆచూకీ లభ్యమైంది. శివరామకృష్ణ తిరుపతిలో ఉన్నట్లు సమాచారం అందింది. బంధువులు తిరుపతి వెళ్లి శివరామకృష్ణను పెడన తీసుకువస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థికి ప్రోత్సాహం

బంటుమిల్లి : విట్ యూనివర్సిటీలో సీటు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బి. సాయి వెంకట గణేష్‌కు రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ సోమవారం ప్రోత్సాహక నగదు అందజేశారు. గత సంవత్సరం ఇదే విశ్వవిద్యాలయంలో మహ్మద్ తబస్సుమ్ సుల్తానా సీటు సంపాదించిన విషయం విదితమే. సాయి వెంకట గణేష్‌కు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ మందపాటి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

మచిలీపట్నం టౌన్ : ఇంజనీరింగ్ సెకండియర్ విద్యార్థిని ఐనాల నాగసాయిహరిణికి రూ. 60 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను ఆది వెలమ సంఘం నాయకులు పిళ్ళారిశెట్టి శ్రీనివాసరావు అం దజేశారు. అంకాల సుబ్బారావు, మాకర్ల వాసు, సత్యనారాయణ, శివప్రసాద్, పరిమి అప్పలస్వామి, మహేష్, ఈశ్వర్, మంగపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బత్తిన కాంతారావు సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. కాంతారావు భౌతిక కాయాన్ని ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ రమేష్‌బాబు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసు స్టేషన్ సిబ్బంది రూ. 40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాంతారావు మృతి పట్ల ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సచివాలయంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలు

పెడన : తొమ్మిదోవార్డు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కూటమి నాయకులు యక్కల శ్యామలయ్య, పత్తిపాటి జయకృష్ణ, బొడ్డు ఆనందరావు, పులి రవీంద్రనాథ్, ఉమ్మిటి వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, పింజల ఆనంద్, యర్రా గాంధీ, కోటేష్ పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలని వినతి

మచిలీపట్నం టౌన్ : కృష్ణా వర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బందికి పే స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఉపకులపతి జ్ఞానమణి, రిజిస్ట్రార్ శోభన్‌బాబులకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి జి. వీరబాబు మాట్లాడుతూ, అర్హతలు ఉండి కూడా పే స్కేళ్లుఅందుకోవడం లేదన్నారు. కొడాలి శర్మ, రాజేష్, సిహెచ్. జయరావు, ప్రసాద్, శ్రీనివాస్, పి.జ్యోతి, నాగు పాల్గొన్నారు.